కందకుర్తిలో త్రిపుర గవర్నర్ పర్యటన

నవతెలంగాణ-రెంజల్



నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గ్రామంలోని డాక్టర్ బలిరామ్ హెగ్దేవార్ పూర్వికులు నివసించిన స్థలంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన స్మృతి మందిరాన్ని మంగళవారం త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం చారిత్రక పుణ్యక్షేత్రంగా మారిందని, స్మృతి మందిర నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందించి నిర్మాణానికి సహకారాలు అందించాలన్నారు. ఆయన వెంట బీజేపీ బోధన్ నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డీ మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుధాకర్ చారి, గోవింద్, ఉప సర్పంచ్ యోగేష్, భైరిబత్రి రమేష్, జల్ల శ్రీనివాస్, గోపికృష్ణ, గొజ్జ గంగాధర్, తదితరులున్నారు.

రంగరాజన్ పై దాడిని ఖండిస్తున్నాం

సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

రామరాజ్యం ముసుగులో చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడిని ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగరాజన్ లౌకికవాది, ప్రజాస్వామ్యవాది, పరమత సహనం కలిగిన వ్యక్తి అని అలాంటి వ్యక్తిపై మతోన్మాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. పూజారులపై ఇటువంటి దాడులు మళ్లీ జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మతోన్మాదం పేరు పై దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. మతోన్మాద ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు మళ్లీ ఆయన మీదనే విష ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు అరుణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత



ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు హ్యాపీ

- కొత్త రేషన్‌కార్డులు నిరంతర ప్రక్రియ
- నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడమే లక్ష్యం
- ప్రతి తండా నుంచి మండల, జిల్లా కేంద్రానికి రోడ్డు విస్తరణ పనులు
- డ్రైపోర్టు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా
- ఇంటిగ్రేడెట్ గురుకులం, నవోదయ మంజూరు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నాం. ఏడాది పాలనలో అనేక మార్పులు తీసుకొచ్చాం. విద్యా, వైద్య రంగాలతో పాటు రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. దీంట్లో భాగంగా టీచర్‌ల, ఎంఈవో పోస్టులను భర్తీ చేశాం. వైద్య రంగం బలోపేతానికి, పీహెచ్‌సీల అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పాటు రైతులకు సంబంధించి సన్న వడ్లకు బోనస్ చెల్లించాం. రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేశాం. ఉచిత కరెంట్ అమలు చేస్తున్నాం. రైతు భరోసా సైతం అమలు చేస్తున్నాం. రూరల్ నియోజకవర్గంలో తండాలు ఎక్కువగా ఉంటాయి. తండాలు, గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్లు వేసి కనెక్టవిటీ పెంచే పనులు కొనసాగుతున్నాయి. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు' నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. నవతెలంగాణ ప్రతినిధులు మీస మధు, సయ్యద్ నయీముద్దీన్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజాపాలనతో ప్రజలు హ్యాపీ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు క్రమంగా అమలు చేస్తున్నాం. మాట ప్రకారం కుల గణన చేపట్టాం. సన్న వడ్లకు బోనస్ చెల్లించాం. రెండు ఎకరాల లోపు రైతులకు ఇది వరకే రైతుభరోసా డబ్బులు వారి ఖాతాల్లో పడ్డాయి. ఉద్యోగాలు కల్పించాం. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం మహిళలకు రుణాలు ఇస్తున్నాం. ప్రత్యేకంగా మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయిస్తున్నాం. రాబోయే కాలంలో ఇందిరమ్మ ఇండ్లు అందజేయనున్నాం. ధరణిలో పార్ట్ -బీలో ఫ్రీజింగ్‌లో ఉన్న 20 లక్షల ఎకరాలను భూ భారతిలో రిలీజ్ చేయనున్నాం. వీటికి సైతం రైతు భరోసా వర్తించనుంది.

స్థానిక సంస్థల్లో వచ్చేది కాంగ్రెస్సే

ఏడాది కాలంలో కాంగ్రెస్ చేపట్టిన పనులు ప్రజలు గమనిస్తున్నాం. ఇది వరకు చేపట్టిన పనులు చేబుతాం. బీఆర్ఎస్ ఉనికి లేదు. బీజేపీ మతం ముందుకు తీసుకురావడమే తప్పా.. ప్రజల కోసం చేసిందేమీ లేదు. ఇంకా నాలుగేండ్లు అధికారంలో ఉంటాం. ప్రజలకు అందుబాటులో ఉంటాం. ప్రజాపాలన మెచ్చిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు

రేషన్ కార్డులు, రైతు భరోసా నిరంతర ప్రక్రియ

అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు తప్పకుండా మంజూర వుతాయి. రాష్ట్రంలో పదేండ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వలే. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరించాం. కుటుంబాలు పెరగడంతో పెద్దమొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించి ఖచ్చితంగా రేషన్ కార్డులు అందజేస్తాం. ఇది నిరంతర ప్రక్రియ. రైతు భరోసా రెండు ఎకరాల లోపు రైతులందరికీ జమ అయ్యాయి. ఒక్క గ్రామాల్లోనే ఇచ్చామనేది అవాస్తవం. రైతుల ఖాతాల్లో వేసేశాం. పథకాల అమలు నిరంతర ప్రక్రియ.

ముంపు లేకుండా ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులు

కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ హయాంలో ప్రాణహిత చేవెళ్ల పథకం కింద 20,21,22 ప్యాకేజీ పనులు నాటి ఇరిగేషన్ శాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డి హయాంలో చేపట్టాం. పాత ఆయకట్టు 82 వేలు ఎకరాలు కాగా.. ఈ పనులతో 1.82 లక్షల ఎకరాలకు నీరు అందనుంది. 1100 కోట్ల రూపాయలతో పనులు చేపట్టగా.. రూ.800 కోట్లతో పనులు సైతం పూర్తయ్యాయి. కానీ కానీ బీఆర్ఎస్ వచ్చాక రీడిజైన్ పేరుతో వ్యయం రూ.3 వేల కోట్లకు పెంచింది. 2000 ఎకరాల ముంపునకు గురికానుంది. ఇందులో 800 ఎకరాలు ఫారెస్ట్ ల్యాండ్ కాగా.. మిగతా 1200 ఎకరాల పట్టాభూములు సేకరించాల్సి వస్తుంది. 8 వేల మంది జనాభాకు పునరావాసం కల్పించాల్సిన పరిస్థితి కల్పించింది. రీడిజైన్ పేరుతో ఖర్చు పెంచింది.. ముంపు పెంచింది కానీ ఆయకట్టు విస్తీర్ణం పెంచలేదు. ప్రస్తుతం పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇది వరకు జరిగిన పని.. ఇంకా చేపట్టాల్సిన పనులపై సర్వే చేశాం. ముంపు లేకుండా పనులు పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరిచేందుకు కట్టుబడి ఉన్నాం

బోధన్‌లో షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకే ప్రభుత్వం కమిటీ వేసింది. మార్టిగేజ్ రిలీజ్ చేసేందుకు రూ.300 కోట్లు రిలీజ్ చేశాం. రైతులు చెరుకు సాగు చేసేందుకు ముందుకు రావాలని కోరాం. దానికి కావాల్సిన సపోర్ట్ ఇస్తామని రైతులకు భరోసా కల్పించాం. ట్రైనింగ్ కోసం మహారాష్ట్రకు సైతం పంపిస్తామని చెప్పాం. 15 వేల ఎకరాలు సాగు అయితేనే ఫ్యాక్టరీ నడిపేందుకు వీలు ఉంటుంది.

ఫ్యాక్టరీ తెరిపించేందుకు రైతుల మీద నెపం నెట్టడం లేదు. రైతులతో అగ్రిమెంట్ చేసుకుంటాం. చెరుకు సాగుకు వర్కట్ చేస్తున్నాం. మహారాష్ట్రలో స్టడీ టూర్‌కు పంపిస్తాం. గ్రామానికి ఎంత విస్తీర్ణంలో సాగు కావాలే ఇది వరకే నిర్ణయించి రైతులకు సూచించాం. ప్రాజెక్టు ఓపెన్ చేయడానికి ఆరు నెలలు సరిపోతది. పంట చేతికి రావడానికి 9 నెలలు అవుతుంది. కావున రైతులు ముందుకు వస్తే ఫ్యాక్టరీ తెరిపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

రోడ్లు, విద్యా, వైద్యం, రైతు సంక్షేమమే లక్ష్యం

రూరల్ నియోజకవర్గంలో ప్రధానంగా నాలుగు అంశాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నా. రోడ్లు, విద్యా, వైద్య రంగాలతో పాటు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రణాళికతో పనులు చేపడుతున్నాం. రూరల్ నియోజకవర్గానకి ప్రధానంగా వ్యవసాయమే ఆధారం. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ఒక మీటర్ పెంచేందుకు రూ.600 కోట్లు కావాలని సీఎం రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించాం. పనులు 80 శాతం ఇది వరకే పూర్తి అయ్యాయి. మరో 20 శాతం పెండింగ్‌లో ఉంది. ఆ పనులు పూర్తి చేసి లక్ష ఎకరాలకు నీళ్ల ఇవ్వడమే ముఖ్య ప్రాధాన్యతగా పని చేస్తున్నా.

ప్రతి తండా, గ్రామం నుంచి మండలానికి రోడ్డు వేయడంతో పాటు మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వేయడమే లక్ష్యంగా రూ. 1200 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. నియోజకవర్గానికి ఇంటిగ్రేడెట్ గురుకులం మంజూరైంది. త్వరలో నవోదయ విద్యాలయం రాబోతుంది. యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ కోసం ప్రయత్నం చేస్తున్నా.

ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళిక రూపొం దించాం. ఇందల్‌వాయిలో ట్రామా సెంటర్, మథర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ కోసం ప్రభుత్వానికి నివేదించాం. సిరికొండ, జక్రాన్‌పల్లి, ముదక్‌పల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించాం. గల్ఫ్ కార్మికులకు కొత్త పాలసీ. రూపొందించాం. అక్కడ ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే రూ.5 లక్షలు.. పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్ సదుపాయం కల్పిస్తున్నాం.

తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి

గతంలో టీయూకు రెగ్యూలర్ వీసీ లేకుండే. కాంగ్రెస్ వచ్చాక కొత్తగా వీసీని ఏర్పాటు చేశాం. సరిపడా ప్రొఫెసర్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఇది వరకే సూచించాం. ముఖ్యంగా విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. ముఖ్యంగా ప్రతి మండలానికి ఎంఈవోను ఏర్పాటు చేశాం. టీచర్‌ల ఖాళీలు భర్తీ చేశాం. ప్రతి స్కూల్‌కు సైతం పీఈటీని సైతం ఏర్పాటు చేశాం. వంటమనుషులకు సైతం ట్రైనింగ్ ఇస్తున్నాం. గురుకులాల్లో డైట్‌మెంట్ పక్కాగా అమలు చేస్తున్నాం. మెనూ చార్జీలు పెంచాం.

మంత్రివర్గంలో జిల్లాకు చోటు

టీపీసీసీ అధ్యక్షులుగా బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను నియమించడంతో జిల్లా నుంచి పార్టీకి భాగస్వామ్యం ఉంది.. కానీ ప్రభుత్వం లో భాగస్వామ్యం కావాలని అడుగుతున్నాం. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని అడుగుతున్నాం. పార్టీ అధిష్టానం నిర్ణయించాల్సి ఉంది. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ దృష్టికి ఇది వరకే తీసుకెళ్లాం.

డ్రై పోర్టుకు ప్రయత్నిస్తున్నాం

నియోజవకర్గంలో ప్రధానంగా వరితో పాటు పసుపు, ఎర్రజొన్నలు సాగవుతున్నాయి. వాటిని ఎక్స్‌పోర్ట్ చేసేందుకు డ్రై పోర్ట్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నా. రాష్ట్రానికి రెండు మంజూరు కాగా ఒకటి జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేసేందుకు అడుగుతున్నా. ఇక్కడ నుంచి హైవే, రైల్వే కనెక్టవిటీ ఉంది. అటు ముంబాయికి, ఇటు మచిలీపట్నానికి 600 కిలోమీటర్‌ల దూరంతో సెంటర్‌పాయింట్‌గా ఉంది. ఇండస్ట్రీయల్ జోన్ ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆ దిశగా కృసి చేస్తున్నా. దీంతో పాటు టూరిజం డెవలప్‌మెంట్‌కు పలు ప్రతిపాదనలు ఇచ్చాం. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న జూపల్లికృష్ణరావు టూరిజం శాఖ మంత్రి కావున సహకారం కోరాం.

ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

- మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీల పై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయ మాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్ రెడ్డి మోసం చేశారని అన్నారు. 'ప్రతి మహిళకు నెలకు 2500 చొప్పున డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే 14 నెలలు గెలిచినా కూడా అమలు చేయకపోవడం దారుణం. 14 నెలల డబ్బు 35,000 కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బాకీ పడింది. మహిళా దినోత్సవం లోపు ఈ హామీని నెరవేర్చాలి' అని డిమాండ్ చేశారు.

కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ, ఆడపిల్లలందరికీ ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న హామీలు ఏమయ్యా యని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు పెట్టి మిగతా పథకాలను తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. తాము మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ప్రభుత్వం మరిన్ని బస్సులు పెంచి ప్రజా రవాణాను సులభతరం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఒకవైపు పరీక్షలు..
మరోవైపు ఆపార్ కష్టాలు

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- పెడచెవిన పెడుతున్న ప్రయివేటు పాఠశాలలు
- ఆధార్ సెంటర్‌కు విద్యార్థుల పరుగులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికీ గుర్తింపుకార్డు జారీ కోసం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)కి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థి పుట్టిన తేదీ, పేరు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు (స్పెల్లింగ్ మిస్టేక్స్) ఉండడంతో రిజిస్ట్రేషన్‌కు సమస్యలు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రులు సహకరించినచోట కొంతవరకు నమోదు ప్రక్రియ ముందుకు సాగుతుండగా, మిగిలినచోట్ల గంటల తరబడి కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఆధార్ కార్డులో సవరణ కోసం కేంద్రాలు అందుబాటులో లేకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షగా మారింది.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ నసురుల్లాబాద్ బాన్సువాడ మూడు మండలాల్లో 25 వేల పైగా విద్యార్థులు ఉండగా ఇప్పటికీ వరకు సుమారుగా 10,000 మంది విద్యార్థులకు అపార్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో బాన్సువాడ మండలంలో 17855 మంది విద్యార్థిని విద్యార్థులు ఉండగా 7074 మంది విద్యార్థుల అపార్ నమోదుతో 40 శాతం అయింది. అలాగే నసురుల్లాబాద్ మండలంలో 3725 మంది విద్యార్థులకు 1617 మంది నమోదు తో 44 శాతం, బీర్కూర్ 3544 విద్యార్థులకు గాను 1617 మంది నమోదు తో 45 శాతం అపార నమోదు అయినట్లు తెలిసింది.

అపార్ కష్టాలు

పాఠశాలలో ఒక పేరు ఆధార్ కార్డులో ఒక పేరు ఉండడంతో ఆధార్ కార్డులో సవరణ కోసం కేంద్రాలు అందుబాటులో లేకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షగా మారింది. ఆధార్ సవరణ ఒక పెద్ద పరీక్షగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ సంఖ్య అంటే దేశంలో తెలియని ప్రజలు లేరు. అలాగే విద్యార్థులకు యూనిక్ కోడ్ నెంబరు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ (అటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబరు కూడా 12 డిజిట్లతో విద్యార్థులకు ఒక ఐడీ కేటాయిస్తారు. ఒకే దేశం.. ఒకే స్టూడెంట్ ఐడీ పేరుతో నూతన జాతీయ విద్యావిధానం- 2020 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది కానీ ఇప్పటివరకు సగం మంది విద్యార్థులకు మాత్రమే నమోదు అయింది. ఈ అపార్ నెంబరు కేటాయించడానికి ప్రతి విద్యార్థి పేరు, ఇంటి పేరు, పుట్టిన తేది తదితర వివరలను సేకరించి ఆధార్ కార్డు, స్కూల్ బోనఫైడ్ సరిపోల్చాక విద్యార్థికి ఐడీ నెంబరు కేటాయిస్తారు. అలాంటి ప్రక్రియ నేడు అధార్ కార్డు నమోదులో జరిగిన పొరపాట్లతో అపార్ నమోదు సరిపోక, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.



సవాల్‌గా మారిన ఆధార్ సవరణ

ఆధార్ సెంటర్లకు వెళ్లి మార్పులు, చేర్పులు చేసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మారుపేరు, తండ్రి పేరు తప్పుగా ఉండడంతో సవరణ చెయ్యడానికి ఆధార్ నిర్వాహకులు ధ్రువపత్రాల కావాలంటున్నారు. దీనితో సవరణ ఒక సవాలుగా మారింది. ప్రభుత్వం మొదట 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే అనుకున్నా తర్వాత అందరికీ చేయాలని కేంద్రం భావించడంతో ప్రస్తుతం ప్రతి విద్యార్థికి అపార్ నమోదుకు చర్యలు చేపట్టారు. ఆధార్, అపార లో మార్పులు, చేర్పులకు కూడా వెసులుబాటు కల్పించాలని విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యాశాఖ అలసత్వం.. పెడచెవిన పెట్టిన ప్రైవేట్ పాఠశాల

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ వ్యవహారంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంఒధించి 55.65 శాతం మాత్రమే నమోదు కాగా, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారికి సంబంధించి 25.35 శాతం మాత్రమే నమోదు కనిపిస్తోంది. అయితే విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని త్వరితగతిన చేసేందుకు తమవంతుగా ప్రయత్నాలు సాగిస్తున్న పలు మండల విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అపార్ నమోదు కార్యక్రమం మందకొండ సాగుతుంది. అపార్ నమోదు ప్రక్రియలో చిన్న చిన్న తప్పులను సవరించేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంపీ నిధులు ఎందుకు మళ్లించారు?

- పోచారం అభివృద్ధి విరోధి : కాంగ్రెస్ నాయకుల విమర్శ

నవతెలంగాణ-వర్ని(మోస్రా)



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సు వాడ నియోజకవర్గం శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలోనికి వచ్చానని చెప్పుతూనే ఎంపీ నిధులు 6 కోట్లు ఎందుకు మళ్లించారో చెప్పాలని మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు యల మంచిలి శ్రీనివాస్ రావు, మాజీ బాన్సువాడ ఏఎం సి చైర్మన్ పాత బాలకృష్ణ ప్రశ్నించారు. మంగళవారం మోస్రా మండల కేంద్రం రెడ్డి ఫంక్షన్ హాల్ లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేసి 10 వేల మెజారిటీ ఓట్లతో ఎంపీగా సురేష్ శెట్కార్ ను గెలిపించామని తెలిపారు. ఏనుగు రవీందర్ రెడ్డి, ఎంపీ ఒప్పందం ప్రకారం నియోజకవర్గం అభివృద్ధి కోసం 6 కోట్లు ఎంపీ నిధులను జూపల్లి కృష్ణ విడుదల చేస్తే ఆ నిధులను పోచారం వెనక్కు పంపారని విమర్శించారు. అభివృద్ధికి విరోధిగా పోచారం పని చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరు ఉన్నా వారికి తాము మద్దతు ఇచ్చి గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ నాయకులు మాసాని శ్రీనివాస్, మంత్రి గణేష్, భాస్కర్, కమలాకర్ రెడ్డి,నందు పటేల్, సలీమ్, బొజ్జ శ్రీనివాస్ గౌడ్,పిట్ల హరీష్, బిల్లా రాజశేఖర్ రెడ్డి,ఇంతియాజ్, సతీష్ రెడ్డి, సంగం సాయిలు, శంకర్, గజ్జ నారాయణ, పొత్తు రెడ్డి,నాగుల శ్రీను, విరానాయక్, శ్రీధర్ రెడ్డి, దశ గౌడ్, పలు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఒడిస్సా నుంచి గంజాయి ని ఆంధ్రప్రదేశ్ మీదుగా నాందేడ్ కు తరలిస్తు న్నారని విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20 లక్షల విలువైన గంజాయిని పట్టుకున్నారని నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. బాన్సువాడ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సిఐ స్వప్న ఆధ్వర్యంలో నిజాంసాగర్ మండలం మాగి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కార్పియో వాహనంలో 90.8 కిలోల గంజాయి రవాణా చేస్తున్న నల్గొండ జిల్లా అంబాల గ్రామానికి చెందిన తిరుపతి, గాంధారి జెమిని తాండకు చెందిన గేలోత్ సాత్నంను అరెస్టు పట్టుకున్నారని మిగిలిన ముగ్గురు పరారయ్యారని తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ సిఐ సుందల్ సింగ్, ఎస్సై రాంకుమార్, కానిస్టేబుళ్ల విష్ణు, అవినాష్, మంజుల, సందీప్, అభిషేక్ లను డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.

రూ.2 లక్షల ఎల్‌ఓసి అందజేత


ఎల్‌ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బడా భీంగల్ గ్రామానికి చెందిన హన్మాండ్లు మోకాలి నొప్పులతో నడవలేక బాధ పడుతున్నాడని ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో మోకాలి శస్త్ర చికిత్స ఆపరేషన్ కోసం రూ.2లక్షలు ఎల్‌ఓసి మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అందజేశారు. ప్రశాంత్ రెడ్డి మేలు మర్చి పోలేమని, ఆయనకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ద్రోణగిరి గుట్ట ముగింపు జాతర ఉత్సవాల్లో పాల్గొనాలి



నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ శివ శ్రీనివాస ద్రోణగిరి గుట్ట దేవస్థానం ఉత్సవాలు ఈ నెల 10న ప్రారంభమై బుధవారంతో ముగియనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ద రమేష్ తెలిపారు. మరోవైపు మల్లన్న దేవుని ఉత్సవాలు సైతం ముగుస్తాయన్నారు. ఉదయం స్వామి వారి కళ్యాణం, అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 5గంటలకు 'గిరి ప్రదక్షిణ' కోసం మహిళలు మంగళహారతులతో ప్రదక్షిణలో పాల్గొనాలని అన్నారు. కావున మండలం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ నేర నర్సయ్య, కోశాధికారి ముస్కు చిన్న నర్సయ్య, కమిటీ సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో వసతుల పరిశీలన
- అనంతరం సీ.హెచ్.సీ ఆకస్మిక తనిఖీ
- ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని హితవు


ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


భోజన మెనును పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-బాల్కొండ

ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మంగళవారం మండలంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలను కిచెన్, డైనింగ్ హాల్‌లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. పాఠశాలలో కొత్తగా టాయిలెట్ల నిర్మాణం కోసం ప్రిన్సిపల్ చందన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ..

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. మైనారిటీ బాలికల కళాశాల పరిశీలన అనంతరం ఆయన బాల్కొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్, తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వైద్యులు, అందుబాటులో ఉండి రోగులకు సేవలందిస్తుండడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, మైనారిటీ బాలికల కళాశాల ప్రిన్సిపల్ చందన, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శృతి, డాక్టర్ దీక్షిత, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ. 30,630, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి మంగళవారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.30వేల 630, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లను, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. జల్సాలు, సరదా కోసం పేకాడుతూ కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష

24 మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష పడగా 24 మందికి జరిమానా విధించామని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ మంగళవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 26మందికి ట్రాఫిక్ ఏసిపి నారాయణ ఆదేశానుసారం ట్రాఫిక్ ఎస్సై చంద్రమోహన్ మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాన్ ముందర హాజరుపరచగా 24మందికి 36వేలు జరిమానా విధించారు. కర్నూలుకు చెందిన ఆది నారాయణ, భీంగల్ కు చెందిన ఈర్నాల సాయిలు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష పడిందని తెలిపారు. 24 మందికి జరిమానా విధించామన్నారు.

పండిత్ దీన్ దయాల్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు.. పండిట్ దీన్‌దయాళ్ సేవలను , సమాజానికి చేసిన అమూల్యమైన కృషిని విద్యార్థులు, అధ్యాపకులు స్మరించుకున్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్కే పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ జీవితం, అంత్యోదయ సిద్ధాంతాలు, సమాజ నిర్మాణంలో ఆయన పాత్రను వివరించారు. విద్యార్థులు పండిట్ దీన్‌దయాల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల హృదయ పాఠశాలలో 25న జిల్లాస్థాయి సైన్స్ పోటీలు


జిల్లాస్థాయి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 25ను నిర్మల హృదయ పాఠశాలలో నిరహించే జిల్లా స్థాయి సైన్స్ పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు. జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్టు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ సంబరాల పోస్టర్‌ను మంగళవారం నిర్మల హదయ పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. నిర్మల హృదయ పాఠశాలలో నిరహించే జిల్లా స్థాయి సైన్స్ పోటీలను జయప్రదం చేయాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రయింగ్, ఉపాధ్యాయులకు ఉపాన్యాస పోటీలు ఉంటాయాన్నారు. గెలుపొందిన వారికి వరుసగా 3 వేలు, 2వేలు, వేయి రూపాయల క్యాష్ ప్రైజ్ తో పాటు మెమంటోస్ అందజేస్తామని తెలిపారు. ప్రతి స్కూల్ నుండి పోటీకి ఒక్కరు చొప్పున పంపాలన్నారు. చీఫ్ గెస్టుగా డీఈఓ వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నర్రా రామారావు, జయని నెహ్రు, రామ్మోహనరావు కొయేడి నర్సింలు గౌడ్, ప్రసాదరావు, శ్రీనివాస్, రామకష్ణ నిర్మల్ హదయ స్కూల్ ప్రిన్సిపాల్, సూరి, ఈవీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేఫర్ ఇంటర్నెట్ డే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా మంగళవారం సేఫర్ ఇంటర్నెట్ డేని జిల్లాలో ఐడిఓసిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధు, ఐడిఓసి పాలనాధికారి ఏఓ ప్రశాంత్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మధు ఇంటర్నెట్‌ని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి.. దానిని సరిగా వాడకపోతే ఎటువంటి దుష్పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని తగు జాగ్రత్తలు తెలిపారు. అదేవిధంగా సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో దాని నుంచి మనల్ని ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను వివరించారు. ఐడిఓసి పాలనాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ.. మనం చేసే చిన్న చిన్న తప్పుల వల్లనే మనం సైబర్ నేరాలలో బాధితులం అవుతున్నామని తెలిపారు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడంవల్ల మనల్ని మనం కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలను అమలు చేయకూడదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పట్టణ శివారులోని చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓలకు పంచాయతీ ఎన్నికల మొదటి దశ నిర్వహణ తీరుతెన్నులపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను ఎంతో జాగరూకతతో నిర్వర్తించాల్సి ఉంటుందని, నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించగల్గుతారని అన్నారు. దీనిని దష్టిలో పెట్టుకుని శిక్షణ తరగతుల్లో సూచించే అంశాలను శ్రద్ధగా విని ఆకళింపు చేసుకోవాలని, ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని ఈ.సీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కషి చేయాలని హితవు పలికారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను అడిగి నివత్తి చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా కొత్త బ్యాంకు ఖాతాను తెరువాల్సి ఉంటుందని, ఈ ఖాతా ద్వారానే ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీలు జరుపాలని ఈ.సీ నిర్దేశించినందున నామినేషన్ పత్రాల కోసం వచ్చే అభ్యర్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని అభ్యర్థి పేరును అక్షరక్రమం కోసం పరిగణలోకి తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. వెంటదివెంట డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, డీఎల్పీఓ ఏ.శివకష్ణ, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌ను కలిసిన మహిళ మండలి సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం నూతన తహశీల్దార్ కన్నాజీ గజనాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంను అందజేశారు. కలిసిన వారిలో అధ్యక్షురాలు ద్యావరాశెట్టి లలిత, ఉపాధ్యక్షురాలు నేర సరిత, దాసరి లక్ష్మీ, పెండెం వనజ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాల యందు,మండలంలోని మగ్గిడి ఉన్నత పాఠశాలలో మంగళవారం కౌమార దశపై విద్యార్థులకు. వర్ద్ స్వచ్ఛంధ సంస్థ సిబంది కె.విజయకుమార్, సరిత అవగాహన కల్పించారు. కౌమార దశ మార్పులు, రక్తహీనత, వ్యక్తిగత మార్పులు, హెచ్ఐవి, ఎయిడ్స్ తదితర గురించి వివరించారు. అనంతరం 10 తరగతిలో విద్యార్థులకుకి క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మద్దికుంట శ్రీనివాస్, హరిత ఉపాధ్యాయులు కిషన్ , ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవల్లిక 20 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి ఉచిత శస్త్ర చికిత్స కోసం ఆర్మూర్ లయన్స్ ఆస్పత్రికి పంపించారు. లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్మన్ చాకులింగం, స్థానిక బాధ్యులు జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ భాయ్ పటేల్, వంశి రెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస జరిగితే సమాచారమివ్వాలి

- కిషోర బాలికలకు మొబైల్ ఫోన్ ఇవ్వవద్దు
- అన్ని రోగాల సమూహమే ఎయిడ్స్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సుజాత

గృహహింస జరిగితే సమాచారమివ్వాలని వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత తెలిపారు. మండలంలోని వివేక్ నగర్ తండా మహిళా గ్రామ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ద్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుజాత హాజరై మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల ఇండల్లో అత్తమామలతో భార్యాభర్తలతో గహహింస జరిగినట్లు అనిపిస్తే సమాచారం అందించాలని అన్నారు. కిశోర బాలికలకు మొబైల్ ఫోన్స్ ఇవ్వరాదని సూచించారు. భార్యాభర్తలకు కోపం ఎక్కువ ఉండకూడదని కోపమనేది కొంపముంచుతుందని తెలి పారు. కిశోర బాలికలకు యుక్త వయసు వచ్చినప్పుడు 13, 14, 15 సంవత్సరాలలో శరీరంలో మార్పులు కనిపిస్తూ ఉంటాయన్నారు. అమ్మాయిలకు కావలసిన జ్ఞానాన్ని యుక్త వయసులో అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. వివాహేతర సంబంధాలతో హెచ్ఐవీ వచ్చే ప్రమాదం ఉం దన్నారు. కార్యక్రమంలో ఐకెపీ కమిటీ కోఆర్డినేటర్ రాములు, గ్రామ సంఘం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- క్రైస్తవ హక్కుల రక్షణ సమితి
- తహసిల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్‌లోని చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో క్రైస్తవ హక్కుల రక్షణ సమితి సభ్యులు మెమోరండం సమర్పించారు. సమాజంలో మతం పేరిట జరిగే ఘర్షణలు మానవ మనుగడకు ప్రమాదమని, మానవత్వానికి మించిన మతం లేదని అన్నారు. ఆలయ అర్చకుడి పై అకారణంగా దాడి చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ దైవ చిత్తం మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాసే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు మతోన్మాదంతో పెట్రేగిపోతూ మానవ సమాజంలో అలజడులను సష్టిస్తున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టినప్పుడే ఇలాంటి దాడులు జరగకుండా ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో క్రైస్తవులను ఊచకోస్తామని నెట్‌లో వైరల్ అవుతున్న వీడియోలను సుమోటోగా తీసుకొని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాల్ జాషువా, ఉమ్మడి జిల్లా న్యాయ సలహాదారుడు జి జి రామ్, సభ్యులు కప సత్యం, అశోక్, గోవింద్ పేట్ పిఎసిఎస్ డైరెక్టర్ సమూయేల్, ప్రకాష్ , అగస్టీన్, షడ్రక్, రమేష్ జాన్, లాజర్, వినోద్, దేవిడ్, రాజు, విలియంలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని డీఈకి వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో ఊరి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఊరు బయటకు తరలించాలని గ్రామస్తులు మంగళవారం పట్టణంలో విద్యుత్ కార్యాలయంలో డి ఈ పివి. రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గగ్గుపల్లి గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఊరి మధ్యలో ఉన్నందున ప్రజలకు ఊరు నుంచి వెళ్లే వాహనాలకు భయాన్ని కలిగిస్తోందని ప్రమాదాలు సంభవిస్తున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలని గగ్గుపల్లి శ్యామ్, సాయన్న, శ్రీకాంత్, సురేష్ కోరారు.



త్రిపుర గవర్నర్‌కు పసుపు పొడి అందజేత



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని జేఎం కేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘంలో మ్యానుఫ్యాక్చర్ చేసిన పసుపు పౌడర్ ను మంగళవారం అందజేసినట్లు డైరెక్టర్ తిరుపతిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా నర్సింగ్ పల్లి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి హాజరైన త్రిపుర గవర్నర్‌ను కలిశామన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలోని మొట్టమొదటి టర్మరిక్ క్లస్టర్ ద్వారా పరిశ్రమ నెలకొల్పి అందులో 600 మంది రైతులతో ఐదు గ్రామాల ప్రజలు కలిసి ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకొని విలువ ఆధారిత వస్తువులు తయారుచేసి మార్కెటింగ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా నిధులు మంజూరు చేసిందని గవర్నర్‌కు వివరించామన్నారు. దీనికి గవర్నర్ స్పందిస్తూ అక్కడ కూడా పసుపు పండిస్తారు కాబట్టి త్రిపుర రాష్ట్రానికి సంఘం తరపున వచ్చి ఒకసారి విజిట్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో జయం కేపీఎం డైరెక్టర్ పాట్కారి తిరుపతిరెడ్డి , సభ్యులు శిరీష లింగం పాల్గొన్నారు.

లేబర్ కార్డు ఉన్నవారికి ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్లు గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం లేబర్ కార్డు ఉన్న కూలీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్టు నిర్వాహకుడు సమీర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఒకసారి ఈ గ్రామాన్ని సందర్శించి లేబర్ కార్డు ఉన్నవారికి హెల్త్ చెకప్‌తో చేయనున్నట్టు తెలిపారు. కాగా మంగళవారం 15 మంది లేబర్ కార్డు సభ్యులకు పరీక్షలు నిర్వహించామని వారన్నారు. ఈ గ్రామంలో సుమారు 200 మందికి లేబర్ కార్డులు ఉన్నాయని వారు తెలిపారు. ఆయన వెంట దనిష్ తదితరున్నారు.

అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం పరిశీలన




నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ మంగళవారం పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని, తప్పులతో పాటు ఆకుకూరలు వడ్డించాలన్నారు. బియ్యంలో పురుగులు వస్తున్నాయన్న ఆరోపణలు వస్తుండడంతో ముందుగా బియ్యాన్ని శుభ్రం చేసుకుని వండాలని ఆయాకు సూచించారు. ఆయన వెంట అంగన్వాడీ టీచర్ వీణ, ఆయాలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు వచ్చేనా..?

- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు
- 10/10 జీపీఏ సాధించని మండలం
- ఉపాధ్యాయులు దృష్టిపెడితేనే మంచి ఫలితాలు



నవతెలంగాణ-నిజాంసాగర్

కష్టపడి ఇష్టంగా చదివి పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని, అందుకు తల్లిదండ్రులు విధిగా తమ పిల్లల్ని ప్రతిరోజు పాఠశాలకు పంపాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు ఏ సంవత్సరమూ 10/10 జీపీఏను నిజాంసాగర్ మండలం సాధించలేదు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు దృష్టిపెడితేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పదో తరగతి పరీక్షల్లో మండలం నుంచి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించింది ఒక్కరంటే ఒక్క విద్యార్థి కూడా లేరనే చెప్పుకోవాలి. మండలంలోని మల్లూర్, అచ్చంపేట్, నిజాంసాగర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. నిజాంసాగర్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాల, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు న్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలన్నింటిలో కలిపి 342 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో 119 మంది బాలికలు, 223 బాలురు ఉన్నారు. అయితే ఈ ఏడాది ఎంతమంది ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతారనేది వేచి చూడాల్సిందే మరి.

బోధించి ఉపాధ్యాయులదే అలసత్వమా..?

వార్షిక పరీక్షలకు 10 విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు మండలం నుంచి 20 మంది టాపర్‌గా నిలబెడితే విద్యార్థుల తల్లిదండ్రుల ఆనందానికి అవధులుండవు. ప్రయివేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కలిగిన క్వాలిఫై ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని ఊదరగొట్టే ఉపన్యాసాలు చెబుతున్న అధికారులు 10 పరీక్షల ఫలితాల్లో ఉత్తమమైన ఫలితాలు ఎందుకు రాబట్టడం లేదనేది పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా వెళ్లడం, పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పకపోవడం, ఉపాధ్యాయులు పాఠశాలలో సెల్‌ఫోన్లలో రియల్ ఎస్టేట్, యూనియన్ విషయాలపైనే ఎక్కువ దృష్టి పెట్టి బయట తిరగడం అనే ధోరణి పెరగడంతో ఇటువంటి ఫలితాలు వస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. పాఠశాలకు వచ్చామా.. వెళ్ళామా.. అనే రీతిలో ఉపాధ్యాయులు ఉన్నంతకాలం ఎక్కడి నుంచి మంచి ఫలితాలు వస్తాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇవీ గతేడాది ఫలితాలు..

2023-2024 విద్యా సంవత్సరంలో నిజాంసాగర్ మండల వ్యాప్తంగా మొత్తం 258 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాశారు. అందులో 253 మంది విద్యార్థులు పాసయ్యారు. కాగా.. మండలం మొత్తంలో 10/10 జీపీఏ ఎవరికీ రాలేదు. 9.7 జీపీఏ మాత్రమే ఈ మండలంలో టాపర్‌గా నిలిచారు. అయితే ఈ సంవత్సరమైనా ఉత్తమ ఫలితాలు వచ్చేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత కలిగి ఉండాలి



పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రావడానికి అక్టోబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 8:15 నుంచి 9 గంటల వరకు, దానితోపాటు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులను నిర్వహిస్తున్నాం. గ్రాండ్ టెస్ట్‌లు సబ్జెక్టుల వారీగా ఎగ్జామ్ నిర్వహించి వెనుకబడిన పిల్లలకు కనీసం మార్కులు వచ్చేవిధంగా చూస్తున్నాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరళీకృతంతో కలిసి పనిచేస్తేనే అద్భుత ఫలితాలు సాధించవచ్చు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

- ఎంఈఓ తిరుపతిరెడ్డి నిజాంసాగర్

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన మేకల్వార్ గంగారాం అనే వ్యక్తికి ఇటీవల స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. ఆయన ఆరోగ్య చికిత్స నిమిత్తం బాధితుడు గంగారాం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును మంగళవారం మంగళ్ పహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు భాదితుడు గంగరామ్‌కు రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడారు. నిరుపేద, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యానికి గురైతే సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఇల్లెందుల రంజిత్ గౌడ్, చేపూర్ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక మంగల్‌పాడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాటి సంతోష్ గౌడ్, కుంట శ్రీనివాస్, దేగామ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లంగ్డాపూర్ మాజీ సర్పంచ్ మృతి



మృతి చెందిన మాజీ సర్పంచ్ పవన్(ఫైల్)

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పవన్ మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన గత పాలకవర్గంలో సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో ఆయన కృషి చేశారు. గ్రామంలో నర్సరీ, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం ఆయన హయాంలోనే నిర్మించినవి. గ్రామస్తులు, మిత్రులు ఆయన అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన మైసయ్య

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రానికి చెందిన కీసరి మైసయ్య (55) టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన మైసయ్య కుమారుడి పెళ్లి బట్టల కోసం కామారెడ్డి వెళ్లేందుకు తాడ్వాయి పాత బస్టాండ్‌కు ఇంటి నుంచి కాలినడకన వెళుతుండగా చిట్యాల నుంచి తాడ్వాయి బస్టాండ్ వైపు మొరం లోడుతో వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో టిప్పర్ చక్రాలు పైనుంచి వెళ్లడంతో మృతిచెందాడు.

కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న కారు

కాంగ్రెస్ మండలాధ్యక్షునికి స్వల్ప గాయాలు



నవతెలంగాణ-నిజాంసాగర్

కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న కారు ప్రమాదంలో కాంగ్రెస్ మండలాధ్యక్షునికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తన వాహనం సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. జుక్కల్ చౌరస్తా వద్ద రోడ్డుపై వెళ్తున్న కుక్కను తప్పించబోయి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో మల్లికార్జున్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

అమ్మ ఒడి ఆరోగ్య మహిళ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అమ్మ ఒడి ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండల వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తెలిపారు. ప్రతి మంగళవారం అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్, శుక్ర లాంటి మందులు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తండాలను తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్‌దే

- సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

తాండాలను తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ రావు ఆదేశానుసారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, తిమ్మారెడ్డి తండా ప్రజలతో తండా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తిమ్మారెడ్డి తండావాసులు మాట్లాడుతూ.. తండాలో ప్రధాన సమస్య అయిన డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, జీపి బిల్డింగ్, సీసీ రోడ్డు వంటి సమస్యలున్నాయని వారు వివరించారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఎల్లారెడ్డి శాసనసభ్యులు ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లి తండా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. వీరితో పాటు తిమ్మారెడ్డి తండా మాజీ సర్పంచ్ సంతోష్ నాయక్, తండా నాయకుడు రాములు నాయక్, మాజీ జడ్పీటీసీ సామేల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బోండ్ల సాయిలు, వెల్లుట్ల సంతోష్ కుమార్, మన్య నాయక్, శంకర్ నాయక్, లాల్యనాయక్, గంగారాం, కిషన్, తుకారం, రవి నాయక్, చందర్, పీర్యా నాయక్, చత్యానాయక్, రవి, చందర్, రవినాయక్, అంబ్రియా నాయక్, మోహన్ నాయక్, షేర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో 8 బంగారు, 5 వెండి పతకాలు



బంగారు, వెండి పతకాలను సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డికి చెందిన విద్యార్థులు, కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ సెలక్షన్లలో 8 బంగారు పతకాలు, 5 వెండి పతకాలు సాధించారు. ఈ పోటీలు కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఎస్.దివ్య 400 మీటర్ల పరుగులో, ఆర్.సంధ్య లాంగ్ జంప్‌లో, ఎం.అమృత జావెలిన్ త్రోలో, బి.ఇందుమతి షాట్‌పుట్‌లో, ఎం.గాయత్రి లాంగ్ జంప్‌లో అండర్- 20 విభాగంలో, కె.దివ్య 400 మీటర్ల పరుగులో, పి.శ్రీవిద్య డిస్కస్ త్రోలో బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు.

డి.బబిత 400 మీటర్ల పరుగులో, జి.కృష్ణవేణి లాంగ్ జంప్‌లో, జె.కీర్తన డిస్కస్ త్రోలో, ఎం.నవనీత షాట్ పుట్‌లో, డి.రాము 400 మీటర్ల పరుగులో అండర్ 18 విభాగంలో, ఎస్.రుత్విక 400 మీటర్ల పరుగులో వెండి పతకాలను సాధించారు. ఇద్దరు విద్యార్థులు స్టేట్ లెవెల్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యారు. ఈ విధంగా ఉత్తమమైన ప్రతిభతో ముందుకు సాగిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్స్ మీనా, డా.శ్రావణితో పాటు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను గెలుపొందే విధంగా ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ రమాదేవిని అభినందించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-లింగంపేట్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జనార్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్‌తో పాటు నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తమ సత్తా చాటుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని, గ్రామగ్రామాన కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలోనే పరిష్కరించి వారికి అండగా ఉండాలని, వారికి భరోసా ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా బరిలో దించేందుకు నాయకులను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈయనను కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్, నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, చెప్పులు సంగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుకన్య అశోక్ రెడ్డి, సత్యం రావు తదితరులున్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ద్వారా మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో మద్దతు ధర సోయా పంట కొనుగోలు చేపట్టారు. నిబంధనల ప్రకారం జనవరి ఏడవ తేదీతో కొనుగోళ్లను నిలిపివేశారు. అయినప్పటికీ మార్కెట్ యార్డులో దాదాపు 8 వేల క్వింటాళ్ల సోయా పంట కొనుగోలు జరగకుండా అలాగే ఉండిపోవడంతో రైతులు కొనుగోలు చేపట్టాలని రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. తహసీల్దార్‌తో పాటు బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు సోయా పంటను కొనుగోళ్లు చేపట్టాలని రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఒకపక్క ఇలాంటి ఆందోళనలు చేపట్టగా.. మరోవైపు చేపట్టిన కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్టు, వాటిపై విచారణ చేపట్టాలని మద్నూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు కర్రేవార్ రాములు తమసీల్దార్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఎండి ముజీబ్ అవకతవకలపై విచారణ కోసం జిల్లా కో-ఆపరేటివ్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు నివేదికలు అందజేశారు.

అంజిరెడ్డి గెలుపు కోసం ప్రచారం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-గాంధారి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి తరపున బిజెపి శ్రేణులు మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మండలానికి మొదటిసారి రావడంతో మాజీ జెడ్పిటిసి సభ్యుడు తానాజీరావు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఇంచార్జ్ హైమారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు, గాంధారి మండల మాజీ జెడ్పిటిసి హరాలే తానాజీరావు, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు పోతంగల్ కిషన్‌రావు, బిజెపి మండలాధ్యక్షుడు ఈకోళ్ల మధుసూదన్‌రావు, బిజెపి నాయకులు సాయిబాబా, ప్రభాకర్, శ్రీకాంత్‌గౌడ్, రాంసింగ్, హుస్సేన్, కూచి సంజు, నాందేవ్, గంగి రమేష్, మచ్చర్ల శ్రీకాంత్, తూర్పు రాజశేఖర్, గంగారాం, మంజ రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకామాత కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ రేణుకా మాత ఎల్లమ్మ జమదగ్ని ముని రాజుల కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. 49వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ఒడిబియ్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన ఎంఈవో



ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

ఇస్రోలో తయారుచేసిన మిస్సైల్, మంగళయాన్, ఆర్యభట్ట, ఆర్మీ నేవీకి ఉపయోగపడే మిస్సైల్స్‌ను జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి రామస్వామి ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు అన్నీ రంగాల్లో ముందుండాలని సూచించారు. ఈ ప్రదర్శన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబిర్ శ్యాంరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న యాదగిరి సంతాప సభ

• సంతాప సభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆదర్శ కమ్యూనిస్టు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సుదీర్ఘకాలంగా పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన యాదగిరి సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 17న రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ తెలిపారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరన్న సంతాప సభ పోస్టర్లను నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ భవన్, కోటగల్లీలో ఆవిష్కరించారు. యాదగిరన్న సంతాప సభకు పార్టీ శ్రేణులు, విప్లవాభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్ సాయన్న, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కగణేష్, టియుసిఐ జిల్లా నాయకులు విటల్, కిరణ్, రవి సీఎల్పి జిల్లా నాయకులు జలంధర్ పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

• ముదిరాజ్ పెద్ద సంఘం సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి గ్రామ ముదిరాజ్ పెద్ద సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఆయనకు అడ్వాన్స్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంఘం యొక్క 848 నెంబర్లు ఆన్లైన్‌లో తీసుకువచ్చి తమ న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే స్పందించారని వినోద్ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, ముద్ధిరాజ్ సంఘం పెద్దమనిషి జక్కం చిన్నారెడ్డి, డిష్ రాజు, సోప్పరి సుధీర్, సొప్పరి తాళ్ల పెద్ద సాయిలు, జక్కం మహేందర్, సొప్పరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి విమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కోపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లి ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం చైర్మన్ వనిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారతీయ కార్యదర్శి సాయిరెడ్డి, కదిరి సలహాలు సూచనలను ఇచ్చారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ దేవిక, చైర్మన్ జైడి వనిత, డైరెక్టర్స్ పాల్గొన్నారు.

వరిలో జింక్ ధాతు లోపం ఏర్పడితే నివారణ చర్యలు పాటించాలి

• మండల వ్యవసాయాధికారి వైష్ణవ్

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రస్తుతం నమోదు అవుతున్న చల్లటి రాత్రి ఉష్ణోగ్రతల వల్ల నాట్లు వేసిన వరిలో జింక్ ధాతు లోపం ఏర్పడినట్లైతే నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి అవసరం మేరకు ఒకటి నుండి రెండు సార్లు ఐదు రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి వైష్ణవ్ ఒక ప్రకటనలో రైతులకు తెలిపారు. నాటు వేసిన నెల లోపు కాండం తొలచు పురుగు ఆశించినట్లైతే 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు ఎకరానికి చొప్పున వాడుకోవాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో అగ్గితెగులు ఆశించినట్లైతే నివారణకు 0.6 గ్రాములు ట్రైసైక్లజోల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు.

డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా వివరాల ప్రదర్శన



జాబితాను బోర్డుపై ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ పోలింగ్ జాబితా వివరాలను ఎంపిడీఓ వెంకటేశ్వర్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రదర్శించారు. దీనికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 13 సాయంత్రం 5 గంటల లోపల మండల పరిషత్ కార్యాలయం ఏర్గట్లలో రాత పూర్వకంగా సమర్పించాలని ఆయన కోరారు.

కలెక్టర్ చేతుల మీదుగా పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ వారి అన్నయ్య రిటైర్డ్ ఐఏఎస్ అధికారి న్యూఢిల్లీ విక్రమ్ సింహరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరణ చేసి అందజేశారు. విద్యార్థుల కోసం రూపొందించిన మానసిక పరివర్తన, వివిధ అంశాలతో విద్యార్థుల యువతను విద్యార్థులకోసం రూపొందించిన పుస్తకాన్ని పట్టణ గ్రంథాలయ లో వివిధ ప్రభుత్వ పాఠశాలలో అందజేసినట్టు తులసి కుమార్ తెలిపారు.

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్నటువంటి ఎన్ఎసి క్యాంప్‌లో నిరుద్యోగుల నుంచి మంగళవారం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు, ఇప్పిడి ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, చిట్టి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలో హెల్త్ క్యాంప్



హెల్త్ చెకప్ చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మెండోర

పోచంపాడ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల(కళాశాల)లో పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి డాక్టర్ మద్దుల రాకేష్ విద్యార్థినులకు హెల్త్ చెకప్ చేసి అవసరమైన విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి మెడిసిన్ అందించారు. విద్యార్థినులు ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాకేష్ పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

భూపతిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

• మాజీ మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్

నవతెలంగాణ-మోపాల్

మన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అభివృద్ధి దాత రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పుట్టినరోజును బుధవారం తానకుర్థి గ్రామంలో ఘనంగా నిర్వహించి పేదలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులు సాయికుమార్ మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు గ్రామ నాయకులు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెండాగల్లిలో ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనంను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? రుచికరంగా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. మెనూ కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకి సూచించారు. మెనూ వివరాలని విద్యార్థులకు కనపడే విధంగా ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ సమక్షంలో జీపీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

• 15న టీఓటీల ద్వారా శిక్షణ తరగతులు
• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమక్షంలో నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్లలోని మండలాల వారీగా పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఫొటో ఓటర్ల జాబితాను ప్రకటించారు. అదేవిధంగా జిల్లాలోని 5022వార్డులకు గాను 5053పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. అందులో 2531జెంబో బ్యాలెట్ బాక్సులు, 1380 చిన్న బ్యాలెట్ బాక్సులకు ఓవర్ ఆయిలింగ్ రిపేర్, కలరింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వార్డు సభ్యుల ఎన్నికలకోసం బ్యాలెట్ పేపర్లు ముద్రించి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఉపయోగించే పోలింగ్ మెటీరియల్‌కోసం స్థానికంగాగల ఫారంల యజమానుల నుండి సీల్డ్ టెండర్లు స్వీకరించామన్నారు. జిల్లా కొనుగోలు కమిటీద్వారా సంబంధిత మెటీరియల్ కొనుగోలు రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. మెటిరీయల్ సరఫరాకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సరఫరా చేశామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి స్టేజ్-1, సహాయ రిటర్నింగ్ అధికారి స్టేజ్-1, రిటర్నింగ్ అధికారి స్టేజ్-2లకు ప్రొసీడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీచేశామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని 6064 ప్రిసైడింగ్ అధికారులు, 8160 మంది ఓపీఓల ర్యాండమైజేషన్ జరిపారు. మాస్టర్ ట్రైనర్స్‌తో వీరికి పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 10నుండి 12వరకు రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 11న ర్యాండమైజేషన్ నిర్వహించగా 15న టీఓటీల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి జన్మదిన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలకు రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.ని యోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

తేనీటి విందులో త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇంటికి స్వాగతించారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే జిల్లా ప్రముఖులతో కలిసి గవర్నర్‌కి బొకే అందించి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో త్రిపుర గవర్నర్ ఎన్ ఇంద్రసేనరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, పోతంకర్ లక్ష్మి నారాయణ, న్యాలం రాజు, బీజేపీ మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పడకల్ తండా వద్ద రోడ్డు ప్రమాదం

• ఇద్దరు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ తండా వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. డిచ్‌పల్లి మండలం అమృతాపూర్ గ్రామానికి చెందిన వ్యవసాయదారులు పశువులకు కావలసిన మొక్కజొన్న పశుగ్రాసం ట్రాక్టర్ పైన వేసుకొని వస్తున్నారు. పశుగ్రాసంపైన రాజేశ్వర్, బొడ్డెన్న విజయ్ మహేష్ కూర్చున్నారు. ఈక్రమంలో పడకల్ తండా వద్ద పశు గ్రాసం జారిపోగా రాజేశ్వర్, ఒడ్డెన్న కింద పడిపోగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో రాజేశ్వర్, వడ్డెన్న అక్కడే మృతి చెందారు. విజయ్, మహేష్‌కు గాయాలు కావడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్‌పైన, ట్రాక్టర్ డ్రైవర్‌పైన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తిరుపతి తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ సస్పెన్స్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నందిపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ గా పనిచేస్తున్న సిహెచ్ గంగసాగర్ ను సస్పెండ్ చేశామని నిజామాబాద్ డివిజన్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ గ్రేడ్-2గా సీహెచ్.గంగసాగర్ విధులు నిర్వస్తున్న సందర్భంలో ఈనెల 10 న నందిపేట్ సబ్ స్టేషన్‌లో తాగి విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో ఈనెల 11న సస్పెండ్ చేశామని అన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 8న నెహ్రూ పార్క్ వద్ద ఒకటవ టౌన్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి మంగళవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో గాజులపేటకు చెందిన కచ్చ కాయల బబ్లు మద్యం సేవించి బండి నడుపుతు పట్టుపట్టుపడ్డాడు. ఆయన్ను మంగళవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించగా నగరానికి చెందిన గంగా ప్రసాద్, సంజయ్ దిగంబర్‌లు మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను పట్టుకున్నామని ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు మంగళవారం హాజరుపరచగా మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

మట్కా నిర్వాహకునికి ఏడు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఆదర్శనగర్‌లో మట్కా ఆడించిన గుజరాతి గోవర్ధన్‌కు మంగళవారం ఏడు రోజుల సాధారణ జైలు శిక్షతోపాటు జరిమానా ను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. గత నెలలో మట్కా ఆడుతున్నారని సమాచారంతో రైడ్ చేసి ఆరుగురుని అదుపులో తీసుకొని 28వేలు, మూడు మొబైల్స్ జప్తు చేసి వారిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. రాచర్ల నర్సయ్య, శేఖర్, మందాల రాజారాం, ఆటో మహేష్, షేక్‌వలికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించినట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

జీపీ కార్మికుల పెండింగ్ జీతాలను విడుదల చేయాలి

• తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పంచాయితీ కార్మికుల పెండింగ్ జీతాలను వేంటనే విడుదల చేయాలని, వారికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ) జిల్లా నాయకులు మురళి పేర్కొన్నారు. మంగళవారం అయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 180 కోట్ల రూపాయలు సక్రమంగా కార్మికుల ప్రయోజనాల కోసం వాడాలని అన్నారు. విడుదల చేసిన నిధులను కార్మికులకు చేరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఆఫీసర్లు నిర్లక్ష్యం విడనాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగైదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కార్మికుల అకౌంట్లో జీతాలు వేస్తామని చెప్పి నెల గడుస్తున్నా ఇంతవరకు వారి వేతనాలను బ్యాంక్ ఖాతాలో వేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఆఫీసర్లు నిర్లక్ష్యాన్ని విడనాడి తక్షణం కార్మికుల జీతాలను కార్మికులకు అందే విధంగా శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను సమీకరించి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సాయిలు, రాజేశ్వర్, సుశీల, గంగాధర్, అశోక్, మహేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్


34వ సబ్ జూనియర్ బాలుర, బాలికల ఇంటర్ డిస్టిక్ కబడ్డీ ఛాంపియన్ షిప్ ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ కేంద్రంలో జరిగే కబడ్డీ పోటీలకు నిజామాబాద్ జిల్లా కబడ్డీ బాల, బాలికల జట్లను టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్ ద్వారా ఈ నెల 14న జెడ్పిహెచ్ఎస్ మాణిక్ బండార్ పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, కార్యదర్శులు ఏ.లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి మంగళవారం తెలిపారు. క్రీడాకారుల బరువు 55 కిలోల లోపు ఉండాలని, 01.04.2009 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. 16 సంవత్సరాలు మించకుండా, క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, పదోతరగతి మెమో జతపర్చాలని వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్‌ను కలవాలని సూచించారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే జట్ల పేర్లను ఈ నెల 13 సాయంత్రం 5 గంటల లోపు నమోదు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ఈ క్రింది మొబైల్ నంబర్లను 9010894517.9618088086 సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్లు 1564

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జెడ్‌పిటిసి, ఎంపీటీసీలు డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ ఆధారంగా నిజామాబాద్ జిల్లాలోని 31 మండల లకు సంబంధించిన వివరాలను జెడ్పి సీఈఓ డి.సాయగౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిజామాబాద్ జిల్లాలోని 31 జెడ్పిటిసిలు, 307 ఎంపీటీసీలు ఉన్నాయని, పోలింగ్ స్టేషన్ 1564 గా గుర్తించడం జరిగిందని, అందులో జిల్లా వ్యాప్తంగా 8,51,770 ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 3,97,140 ఓటర్లు, స్త్రీలు 4,54,613 మంది ఓటర్లు, ఇతరులు 17 మంది ఉన్నారని అన్నారు. జనాభా ఆధారంగా పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు.

మున్సిపల్ తాజా మాజీ చైర్‌పర్సన్‌కు పితృవియోగం



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ తండ్రి లింబన్న(75) మంగళవారం సాయంత్రం మృతిచెందారు. బాల్కొండలో వారి స్వగృహం వద్ద నేడు వారి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేడు మామిడిపల్లిలో ముజిగే మల్లన్న జాతర

• ఏర్పాట్లు పూర్తిచేసిన వీడీసి రంగులతో ముస్తాబైన రథం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి ముజిగే మల్లన్న జాతర నేడు నిర్వహించనున్నట్లు స్థానిక కౌన్సిలర్లు సంగీత రవిగౌడ్, కవిత కాశీరాం, ఆకుల రాము, విడిసి ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా జిల్లా కేంద్రం నుంచి సైతం భక్తులు వస్తారు. స్థానిక హనుమాన్ ఆలయంలో గల సిడి (రథం)కు మరమ్మత్తు పనులతో పాటు రంగులు వేశారు. గత 50 సంవత్సరాల నుండి స్థానిక విశ్వబ్రాహ్మణ కులస్తుల మహిళలు ఆరు ఫీట్ల ఎత్తుతో బంతి పువ్వులతో తొట్లెలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. నేడు జాతరతో పాటు నైవేద్యాలు సమర్పించి మల్లన్న గుడి చుట్టూ సిడి తిప్పడంతో పాటు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వీడీసీ ప్రతినిధులు ధ్యావల్ల రవి, ఆకుల లక్ష్మణ్, రాజన్న, లక్కారం శ్రీనివాస్, సాజిద్, వడ్ల శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు చేశారు.

తెలంగాణలోనే ఏకైక దేవాలయంగా...

రంగనాయకుల గుడి మండలంలోని మంథిని గ్రామంలో ఉంది. రాష్ట్రంలోని మన ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఉత్సవాలలో పాల్గొని అవకాశం ఉండడంతో వారికి ఎలాంటిది ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నారు.

జాతరకు ఏర్పాట్లు చేశాం

ముత్యం యాదవ్, మంథని



గ్రామ ప్రజా ప్రతినిధుల, విడీసీల ఆధ్వర్యంలో జాతరకు ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం ఈజాతర నిర్వహిస్తాం. ఉత్సవాల్లో కుటుంబ సభ్యులతో ప్రతి ఒక్కరు పాల్గొంటారు.



అతి ప్రాచీనమైన దేవాలయం...

రంగనాయకుల ఆలయం అతి ప్రాచీనమైనదిగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తులు విశ్వసిస్తారు. స్వయాన గోవిందుడు కొలువై ఉండడంతో పాటు పాండవులు 14ఏళ్ల అరణ్యవాసంలో కొంతకాలం ఇక్కడ గడిపారని పూర్వీకులు చెబుతుంటారు.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

- మెడికల్ అధికారి దివ్య

నవతెలంగాణ-భిక్కనూర్

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని మెడికల్ అధికారి దివ్య తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకొని పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ అధికారిణి దివ్య

ఉచిత వైద్య శిబిరం

- హాజరైన 160 మంది ప్రజలు

నవతెలంగాణ-కామారెడ్డి

బిబిపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సుతారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 160 మంది మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరికీ ఉచితంగా బీపీ, షుగర్‌తో పాటు దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, బొల్లానికి అల్సర్, గ్యాస్ ట్రబుల్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరం ఉన్నవారిని ఎంపిక చేసి పేషంట్ల కోసం గురువారం బస్సు వచ్చి వాళ్లను అవసరమైన ఆసుపత్రులకు తరలిస్తుందని ~~తెలిపారు. ఇప్పటివరకు 35మంది పేర్లు ఇచ్చినట్టు~~ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జనరల్ మెడిసిన్ శ్రియ, ఆర్తో స్పెషలిస్ట్ లావణ్య, నర్సులు సునీత, రేవతి, ఫార్మసిస్ట్ వినేష్, క్యాంపు ఆర్గనైజర్ ఓబుల్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నాయకుల పల్లెబాట

- గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి
- స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సన్నద్ధం

నవతెలంగాణ-బోధన్

స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ స్థానిక ఎన్నికలను నిర్వహించడానికి రేపోమాపో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. అందులో భాగంగా సోమవారం కలెక్టర్ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ అధికారులకు శిక్షణ ఇవ్వడంతో రాజకీయ పార్టీలలో చలనం మొదలైంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాలూర మండలంలోని ఫతేపూర్, సాలూర గ్రామాల్లో పర్యటించి కార్యకర్తల మనోగతం తెలుసుకున్నారు. మొదటగా ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి సమాయత్తమవుతోంది. దాంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీల గుర్తులపై అభ్యర్థులు పోటీ చేయనుండడంతో పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సమిష్టిగా శ్రమించి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలను దిశానిర్దేశం చేస్తున్నారు. కానీ ఇతర పార్టీలలో ఇంకా ఎన్నికల సందడి మొదలు కాలేదు. బీఆర్ఎస్ పార్టీలో ముందుండి నడిపించే, దిశానిర్దేశం చేసే నాయకుల కోసం కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. బీజేపీ పార్టీలో మేడపాటి ప్రకాశ్ రెడ్డి నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారిలో ఎన్నికల విజయం కోసం కోసం దిశానిర్దేశం చేశారు. ఇప్పటి నుంచి గ్రామాల్లో ఆశావాహులు కాలనీలలో తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



ఫతేపూర్ గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

- టీబీ ఇన్చార్జి సూపర్‌వైజర్ ఆశ్యాన్

నవతెలంగాణ-ఎడపల్లి

క్షయ అతి భయంకరమైందని, దీని నివారణకు వైద్యులు చెప్పిన సూచనలు, సలహాలు పాటిస్తే నిర్మూలన తప్పకుండా అవుతుందని క్షయ వ్యాధి(టీబి) ఇంచార్జి పర్యవేక్షకులు ఆశ్యాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక వైద్యులు (టిబి) క్షయ వ్యాధి నివారణ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశ్యాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహిస్తా ఫిర్దోస్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడిన వారికి వ్యాక్సిన్ తీసుకున్న వారికి టీబీ యాప్ ఆన్‌లైన్ చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో క్షయ వ్యాధి కలిగి ఉన్న రోగులను గుర్తించేందుకు గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలో, ఎంఎల్‌హెచ్‌పిలు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో దేవేందర్ (హెచ్ఎస్), సూపర్వైజర్ రాజేశ్వర్, పావని హెచ్ఎస్, ఏఎన్ఎంలు, ఎల్ఎం.ఎల్.హెచ్.స్, ప్రాథమిక వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దొంగిలించిన ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

రాజంపేట్ పట్టణ కేంద్రంలోని రమేష్ అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్ 2023లో దొంగలించబడింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి తిరిగి బాధితుడికి మంగళవారం పోలీసులు అప్పగించారు. మొబైల్ ఫోన్ చోరీకి జరిగినప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

మొక్కలకు ప్రతిరోజు నీరు పోయాలి

- గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి

నవతెలంగాణ-భిక్కనూర్

మొక్కలకు ప్రతిరోజు నీరు పోయాలని పెద్ద మల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త తీసుకోవాలని, అలాగే నర్సరీలో మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందికి సూచించారు.

80 మందికి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో 80 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ అర్జుమం నిజార తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు షుగర్, బిపి, అస్తమా, థైరాయిడ్, పలు రక్తనమూనాల పరీక్షలు జరిపి మందులు అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాసీం, ఏఎన్ఎంలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రతిభ



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో రాజు

నవతెలంగాణ-లింగంపేట్

మండల మైనారిటీ గురుకుల విద్యార్థి రాహుల్ జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.వెంకట రాములు తెలిపారు. ఈ సందర్భంగా డిస్టిక్ లెవెల్ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి పొందిన రాహుల్‌ను డీఈఓ రాజు అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రాహుల్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని పేర్కొన్నారు.

కల్దుర్కి, సాలూరలో దొంగతనం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని కల్దుర్కి, సాలూర మండల కేంద్రంలోని పలుచోట్ల దొంగలు తాళంవేసిన ఇండ్లను టార్గెట్ చేసి చోరీకి పాల్పడ్డారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చెందర్‌రెడ్డి తెలిపారు. కల్దుర్కిలో లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి బంధువుల పెండ్లికి వెళ్లాడు. ఇంటికి తాళం ఉండడంతో దొంగలు మధ్యాహ్నం వేళ ఇంటి తాళం ధ్వంసం చేసి రూ.2.5 లక్షల నగదు, 5 తులాల బంగారం దొంగిలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సాలూరలో గైని నడిపి లక్ష్మణ్ అనే ఇంటికి తాళం వేసి ఊరెళ్లడంతో ఇంటి తాళం ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న 15వేల నగదు దొంగిలించారని, అలాగే మరో ఇంట్లో 10 వేల నగదు, గ్యాస్ సిలిండర్ దొంగిలించారని ఎస్ఐ తెలిపారు.

పౌష్టికాహారంతో అనారోగ్యం దూరం

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

పౌష్టికాహారంతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని మెడికల్ అధికారి విజయ్ మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం రాజంపేట్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనలు సలహాలు పాటించి మందులు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలు దరిచేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగీత, హెల్త్ సూపర్వైజర్ మంజూరు, గంగామణి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది, తదితరులున్నారు.

ఎంపీటీసీ ఎన్నికలపై దృష్టి సారించాలి

- ఎంపీడీవో వెంకటేష్ యాదవ్
- మండల పరిషత్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-రెంజల్

ఎంపీటీసీ ఎన్నికలపై దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పనులున్నా పక్కనపెట్టి ఎన్నికలకు సంబంధించిన వాటిపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీఓ రఫీ హైమద్, అన్వర్ హైమద్, కార్యదర్శులు రజిత, రాజు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీని భారీ మెజారిటీతో గెలిపిద్దాం

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆల్‌ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పట్టభద్రులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ నిర్మూలనకు 54 వేల ఉద్యోగాలను నియమించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రులంతా నరేందర్‌రెడ్డి అమూల్యమైన ఓటు వేసి గెలిపిద్దామని సూచించారు.

బిర్లా ప్లానిటోరియానికి ఉప్పల్వాయి గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కళాశాల 8,9,10వ తరగతి విద్యార్థులు పిఎంసి ప్రోగ్రాం కింద మంగళవారం హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియంకు బయలుదేరి వెళ్లినట్టు ప్రిన్సిపాల్ ఎం.శివరాం తెలిపారు.



ప్లానిటోరియం వద్ద విద్యార్థులు

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు

- సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని కామారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణం చేత దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు తగు విధంగా స్పందించడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ కారణాలతో డిపార్మెంట్ రూల్‌కు లోబడి కొత్త సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా ఉండేందుకు వినియోగదారునికి దరఖాస్తు చేసుకున్న దానిపై మెసేజ్ రూపకంగా ప్రతి ఒక్క దశలో వెళ్తుందన్నారు. కొత్త సర్వీస్ మంజూరు నిమిత్తం అవసరమయ్యే పత్రాల కోసం వినియోగదారునికి వచ్చిన ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకుని నిర్దిష్ట సమయంలో సమర్పించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా వినియోగదారునికి ఆ సర్వీస్‌పై మరింత అవగాహన ఏర్పడి వెంటనే సంబంధిత పత్రాలు జమ చేయడం వలన సర్వీసులు త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. దీనివలన టీజీఎన్పీడీసీఎల్ కంపెనీపై వినియోగదారునికి పారదర్శకత, జవాబుదారీతనం, సంతృప్తి, నమ్మకం కలుగుతుందని చెప్పారు. అలాగే వినియోగదారుడు తన అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించామని, దీని ద్వారా వినియోగదారుడు సులభంగా తన అప్లికేషన్ నెంబర్‌తో టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి లేదా టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఈ ట్రాకింగ్ సిస్టమ్‌ను రూపొందించడం జరిగిందన్నారు. పై వాటిలో వినియోగదారుడు మరింత సమాచారం తెలుసుకోవడానికి 1912కి ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. వినియోగదారునికి మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు వేగవంతంగా, సులభతరంగా చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

- లక్ష్యాన్ని చేరుకోవాలి
- మానసిక వైద్య నిపుణులు జి రమణ

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి, లక్ష్యాన్ని చేరుకోవాలని మానసిక వైద్య నిపుణులు జి రమణ తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం ప్రణాళిక బద్ధంగా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు వచ్చే అవరోధాలను అధిగమించడానికి తగిన విధంగా మానసిక ఒత్తిడి లేకుండా, గురువులు చెప్పిన విధంగా చదవాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యార్థినీలకు వైద్యులు రమణ అవగాహన కల్పించారు. అనంతరం మానసిక సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోన్‌ను సమాచారం కోసం మాత్రమే వాడాలని, వినోదాలకు వాడకూడదని అన్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు మానసిక సమస్యలు ఎక్కువగా వస్తాయని వనకడం, భయపడిపోవడం, వాంతులు రావడం లాంటివి జరుగుతాయని, ప్రేరేపిత ఆలోచనలు దరిచేరనివ్వకూడదని సూచించారు. విద్యార్థి దశలో వచ్చే ప్రేమ విషయాల్లో క్షణికావేశానికి పోకూడదని, ఈ వయసులో ఆకర్షణలు మాత్రమేనని గమనించాలని సూచించారు. మానసిక సమస్యల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టెలి మానస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు 24 గంటలు అందుబాటులో ఉంటుందని, మానసిక సమస్యలపై కౌన్సెలింగ్ అందుతుందని తెలిపారు. స్థానిక పిహెచ్‌సీ వైద్యులు సురేష్ మాట్లాడుతూ.. పరీక్షల ముందు విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకూడదని మానసిక వైద్యులు, ఉపాధ్యాయులు సూచనలు పాటించాలని, మంచి ప్రతిభ చూపాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈ భీమ్, ప్రిన్సిపాల్ వనిత, ఏఎన్ఎం రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణులు

టెక్నాలజీ ద్వారా విద్యాబోధన చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు విద్యా బోధన చేయాలని ఎంఈఓ రాజా గంగారెడ్డి, మండల నోడల్ అధికారి శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో, పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భిక్కనూర్, బిబిపేట్, దోమకొండ మండలాలలో ఉన్న ఆంగ్ల, జీవశాస్త్ర, తెలుగు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టంపై ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్నెట్, టెక్నాలజీని ఉపయోగించి ఏ విధంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలో పలు సూచనలు సలహాలు అందజేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడానికి ప్రతి ఉపాధ్యాయులు టెక్నాలజీ ద్వారా విద్యా బోధన చేసే విధంగా ముందడుగులు వేయాలని తెలిపారు. అనంతరం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి అనుకూలంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న అధికారి

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్ని (రుద్రూర్)

మండలంలోని అంబం (ఆర్) గ్రామ పరిధిలో గల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు విద్యార్థులు మీ సేవలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ ఈ నెల 28 వరకు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు ఏప్రిల్ 13న నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఫీజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125, ఓసి విద్యార్థులకు రూ.200 ఉంటుందని తెలిపారు.

ధ్యానంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 38 మంది విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎంఈఓ పూర్ణచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మానసికోల్లాసానికి, మెదడు చురుకుగా పనిచేయడానికి ప్రతిరోజు ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- మండల ప్రత్యేకాధికారి జ్యోతి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని అంచనూర్, సీతారాంపల్లి గ్రామాల్లో శానిటేషన్ పనులను అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలోని తడి పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అధికారులు సూచించారు. నర్సరీలలో మొక్కలను పెంచాలని, ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, ఏఈలు శిరీష, వంశీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎంపీడీవో వెంకటేష్ జాదవ్

నవతెలంగాణ-రెంజల్

ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 11 ఎంపీటీసీ స్థానాలకు గుర్తించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీల ఎన్నికలను పురస్కరించుకొని మండలంలో 54 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. మండలంలో మొత్తం 29,845 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎలాంటి అభ్యంతరాలున్నా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో ఈనెల 13న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ రఫీ హైమద్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ రఫీ హైమద్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు